

# అలవాటులేనిపనులు

పూర్వం ఓ గ్రామంలో ఓ రైతు ఉండే వాడు. ఏడాదికి పొలం పని నాలుగు నెలలే కావటంతో, మిగతాకాలంలో ఊరికే కూర్చోకుండా, వ్యాపారం చేయడం నేర్చుకుని బాగా సంపాదించాడు.

అతని కిద్దరు కొడుకులు. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేసి, పెద్ద కొడుక్కి పొలంపని, రెండవ కొడుక్కి వ్యాపారం అప్పగించేసాడు.

ఒకనాడు తోడికోడళ్ళిద్దరికీ తగాదా వచ్చింది. అన్న భార్య తమ్ముడి భార్యతో, "నీ మొగుడికేం? హాయిగా తిని కొట్లో కూర్చోవటమేగా? మా ఆయనేమో ఆ పొలంలో పడి, ఒళ్ళు హూనమయ్యేలా చాకిరీ చేసి పెడితే, తేరగా తినడానికి అందరూ తయారే!" అంది నిష్ఠూరంగా!

అప్పుడు తమ్ముడి భార్య మాత్రం తక్కువ తిందా? "ఓహో! నీమొగుడే మహా కష్టపడిపోతున్నా డనుకోకు! ని మొగుడికి బుర్రలేదు; కాబట్టి. ఆ కొట్లో లెక్కలూ అవీ చేయలేక హాయిగా పోయి పొలంలో పడుకుని, నిద్రపోవటానికి ఆ పని తీసుకున్నాడు. నిజానికి కష్టపడుతూంది మా ఆయనే!" అంది అదే ధాటిలో!

ఆ రోజు సాయంత్రం అన్నదమ్ములిద్దరూ ఇంటికి తిరిగి వచ్చేసరికి భార్యలు వారికి బాగా నూరిపోసారు. మరునాడు ఉదయాన్నే అన్న తమ్ముడితో, "ఒరే, మీ ఆవి డేదో అనవసరంగా మాట్లాడిందట; కొంచెం మందలించు!" అన్నాడు.

తమ్ముడేం తక్కువ తీసిపోలేదు. "అదేం కాదు, వదినే ఏదో గొడవ చేసిందట!" అన్నాడు. ఇలా యిద్దరికీ వాగ్యుద్ధం ప్రారంభమైంది. తండ్రి కలగచేసుకుని సర్దిచెప్పాడు.

అప్పుడు అన్న "ప్చ్, నాన్నా! నాకీ పనితో విసిగెత్తింది. నేను కొట్టుపని చూసుకుంటాను" అన్నాడు.

జి. రామలక్ష్మి, హైద్రాబాదు.

అప్పుడు తమ్ముడు "నాకూ్కడా కొట్టు పనంటే విసుగనిపిస్తోంది. కాబట్టి నేను హాయిగా వెళ్ళి పొలంపని చూసుకుంటాను" అన్నాడు "సరే అలాగే కానీయండి, మీ యిష్టం!" అన్నాడు ఆ రైతు.

అన్న ప్రకారం అన్నయ్య కొట్టుపనికి, తమ్ముడు పొలం పనికీ వెళ్ళారు. కానీ, అన్నకు రోజూ పొలం పనికి అలవాటు పడ్డ వాడు అవటంవల్ల ఆ కొట్టుపనీ, ఆ లెక్కలు ఆ బాకీల, వసూళ్ళు, అమ్మకాలు, కొన టాలూ అర్థంకాక, మరీ విసుగ్గాను, గజిబిజి గాను కనిపించింది; తమ్ముడి పరిస్థితి కూడా యించుమించు ఆలాగే అయింది. పొలంలో కొంచెం దున్నేసరికి ఒళ్ళు హూనం అయి పోయి, కళ్ళుబైర్లు కమ్మి చేతగాక అలసటగా నిద్రపోయాడు!

ఆ సాయంత్రం యింటికి తిరిగి వచ్చారు వాళ్ళు యిద్దరూ. సరాసరి తండ్రి దగ్గర కెళ్ళి, "బాబోయ్! రేపటినుంచి మేము మామూలుగా మా పనులకి తప్పక పోతాము; బుద్ధి గడ్డితిని, పెళ్ళాల మాటలు విని అవస్థలో పడ్డాము. మాకు ఒక్క రోజుకే బాగా బుద్ధి వచ్చింది!" అన్నారు.

అది విని రైతు నవ్వుకున్నాడు. "అందుకే నర్రా, ఎవరికి తగిన పనిని వారికి అప్పగిం చింది. ఎవరికి ఏ పని క్షుణ్ణంగా వచ్చో, వారు ఆ పనిలో నిమగ్నులవటం మేలు!" అన్నాడు.

మరునాడు అన్న పొలానికీ, తమ్ముడు కొట్టు పనికీ ఆనందంగా వెళ్ళారు,

తోడికోడళ్ళిద్దరూ తమ భర్తలు ఒకటి కావటంతో, వారూ వారి కొట్లాటలు మాని, ఒకటైపోయారు. ఆ రోజునుంచి ఇంటి పనిని సమంగా చేస్తూ, కొట్లాటలు లేకుండా హాయిగా సంసారాన్ని సాగించారు. ఇదంతా చూస్తూన్నరైతు తనకుటుంబంలోనిమార్పుకు ఎంతో సంతోషించాడు.

